క్లుప్తంగా

నేడు రెండో విడత 'సురక్ష'

కొక్కిలిగడ్డ(మోపిదేవి): జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు రెండో విడత ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు మోపిదేవి పీహెచ్‌సీ డాక్టర్ అనిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొక్కిలిగడ్డ సచివాలయం వద్ద క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.శ్రీవిద్య గురువారం సందర్శించారు. రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు విద్యుత్, ఫర్నిచర్, ఫ్యాన్‌లు, చప్టా, వాటర్ వంటి ఏర్పాటుకు బీఎల్వో, వీఆర్వోలకు సూచించారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలు

ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ

చల్లపల్లి: రాష్ట్రంలో పేదలు వైఎస్సార్ సీపీతోనే ఉన్నారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ జాన్ బెన్నీ లింగం అన్నారు. స్థానిక సీబీసీఎన్‌సీ చర్చిలో గురువారం ఏఐసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ బెన్నీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ జగన్ మోహన్‌రెడ్డిపై విషం కక్కుతుంటే, రాష్ట్రంలోని పేద కుటుంబాల వారు జగన్ పాలనపై సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దైవ సేవకుల సమావేశాలు ఏర్పాటు చేసి ఎక్కడ లేని ప్రేమ చూపుతున్నారని, వారిని నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నేత సింహాద్రి వికాస్ బాబు, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల జయరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు జయరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఏఐసీసీ జిల్లా నూతన కన్వీనర్‌గా చల్లపల్లి ఒకటో వార్డులోని సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ పెరికే దేవదానం నియమితులయ్యారు.

సమష్టి కృషితో డివిజన్‌కు మంచి పేరు



మచిలీపట్నంటౌన్: విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఈఈ భాస్కరరావును సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమష్టి కృషితో డివిజన్‌కు మంచి పేరొచ్చిందన్నారు. దీంతో ఎమ్మెల్యే పేర్ని నాని ప్రత్యేకంగా ఉద్యోగులను అభినందిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఉద్యోగ సంఘ అధ్యక్షుడు బొర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈఈ భాస్కరరావు కార్మికుల పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ కార్యదర్శి సన్నా శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో అగ్రగామి భారత్

కోనేరుసెంటర్: రసాయన శాస్త్ర విభాగంలో భారతదేశం ప్రపంచంలోని అగ్రగామి దేశాలతో పోటీ పడుతోందని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సి.సురేష్‌రెడ్డి తెలిపారు. 'రసాయన శాస్త్ర పరిశోధనలతో భవిష్యత్తు' అనే అంశంపై గురువారం కృష్ణా విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో అతిథోపన్యాసం జరిగింది. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో రసాయన శాస్త్ర పరిశోధనలతో భారతదేశం అగ్రగామిగా ఎదగబోతుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ ఎం.వి. బసవేశ్వరరావు, వై. సుందర కృష్ణ, కెమిస్ట్రీ విభాగాధిపతి డి.రామశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాల బహూకరణ

గూడూరు: గూడూరు మండలం పోలవరం పాఠశాలకు పూర్వ విద్యార్థులు బీరువాలను బహూకరించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి కె.లక్ష్మీ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యాన పాఠశాలకు సమకూర్చిన బీరువాలను గురువారం హెచ్‌ఎం విజయలక్ష్మికి అందజేశారు. శ్యాం ప్రసాద్, శాస్త్రి, కోట ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో ఇటీవల మరణించిన బొర్రా నాగరాజు కుటుంబాన్ని అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకట కృష్ణ గురువారం సందర్శించారు. నాగరాజు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన మృతుని భార్యకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాచు శ్రీనివాసరావు, పూషడపు రత్నగోపాల్, బాదర్ల లోలాక్షుడు, కలపాల ప్రసాద్, మెరకనపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కోడూరులో అంబరాన్నంటిన బాలల సంబరాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో విద్యాశాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన బాలోత్సవ్-2024 వేడుకలు అంబరాన్నంటాయి. ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో రమేష్‌బాబు, డీఈఓ తాహెరాసుల్తానా మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలందరికీ విద్య, వైద్యం తప్పనిసరిగా అందాలనే లక్ష్యంతో సమూల మార్పులు చేపట్టారని రమేష్‌బాబు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ 'అమ్మఒడి' నగదును జమ చేస్తున్నట్లు రమేష్‌బాబు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి నాంది పలికినట్లు రమేష్‌బాబు తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఇవ్వడం ఓర్వలేని ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై బురదచల్లడమే పనిగా పెట్టుకున్నారని రమేష్‌బాబు మండిపడ్డారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండలంలోని 40 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని రెండు వేల మంది బాలల సంబరాల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా ప్రదర్శనలిచ్చారు. విద్యార్థులు త్రివర్ణ పతాకాలు, దీపాలు, శిరస్సుపై కుండలతో చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



చేతిలో దీపాలు పట్టుకొని సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

చాంపియన్స్‌కు బహుమతీ ప్రదానం

అకడమిక్, సాంస్కృతిక, క్రీడా అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు చాంపియన్స్ బహుమతులను రమేష్‌బాబు, డీఈఓ అందజేశారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో సత్తాచాటిన స్వతంత్రపురం ఎంపీయూపీ, సాలెంపాలెం ఎంపీపీ, స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలల ఉపాధ్యాయ బృందాలను ప్రత్యేకంగా అభినందించి, ట్రోఫీలు అందించారు. సంబరాల్లో మొత్తం 950 మంది విద్యార్థులకు బహుమతులను అందించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చొరవతోనే 'టిడ్కో' స్థలం

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతోనే పేదల అవసరాలకు గో సంఘానికి సంబంధించిన పది ఎకరాల భూమిని నాడు కొనుగోలు చేశామని ఈ స్థలంలోనే జీ+3 టిడ్కో గృహాల నిర్మాణం జరిగిందని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. గో సంఘం వద్ద నిర్మించిన 864 టిడ్కో గృహాల సముదాయం వద్ద రూ. 4 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం పేర్ని నాని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గో సంఘం స్థలాన్ని ప్రజా అవసరాల కోసం కొనుగోలు చేయడానికి సంఘం ప్రతినిధులను సంప్రదించగా ఎకరం రూ. 10 లక్షలు చొప్పున విక్రయించేందుకు ఒప్పుకున్నారన్నారు. నాటి కలెక్టర్ నవీన్‌మిట్టల్‌ను భూమి కొనుగోలు చేయాలని వైఎస్సార్ సూచించారన్నారు. నిబంధనల ప్రకారం ఎకరానికి రూ. 10 లక్షలు ఇవ్వడానికి ఇబ్బందులు ఎదురైతే ఫైల్ పంపితే మంజూరుకు సంతకం చేసి పంపుతానని నాడు పేర్కొన్నారన్నారు. ఆ మహానేత చలువతోనే కొనుగోలు చేసిన ఈ భూమిలో ప్రస్తుతం పేదలకు టిడ్కో గృహసముదాయాన్ని ఏర్పాటు చేశారన్నారు. రెండు, మూడు రోజుల్లో గృహాలను లబ్ధిదారులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా అందజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లగా రూ. 90 కోట్లతో ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లు, 50 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్, ఎనిమిది ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు, జగనన్న కాలనీల్లో రూ. 30 కోట్లతో విద్యుత్ లైన్లు, స్తంభాల ఏర్పాటు తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలపై ఉన్న ప్రేమతో స్థలాలు, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడమే కాకుండా నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు, కాలనీల్లో విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ వల్లపోతు సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ చింతా మౌనిక, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు, ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు, ఏడీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పేర్ని నాని చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

విద్యుత్ ఉద్యోగుల పనితీరు అభినందనీయం

నియోజకవర్గంలోని విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నగరంలోని గో సంఘం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మచిలీపట్నం నగరంలోని విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పలు విభాగాల అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

చుక్కల చిక్కుల నుంచి విముక్తి

- 22ఏ నుంచి 6,196.32 ఎకరాలు తొలగింపు
- 3,172 మంది రైతు కుటుంబాలకు మేలు
- రైతు భరోసాతో 6,926 మంది రైతులకు రూ.15.58 కోట్లు లబ్ధి



సంగేగడ్డలో ఆర్‌బీకే వద్ద రైతుల వ్యవసాయ కార్యకలాపాలు(ఫైల్)

నాగాయలంక: జగనన్న భరోసాతో రైతులకు చుక్కల భూముల చిక్కుల నుంచి విముక్తి కలిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కృషితో జగనన్న ఇచ్చిన మాట నిలబెట్టుకుని షరతు గల పట్టా భూములను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల జాబితా(22ఏ) నుంచి విముక్తి కలిగించారు. దీనివలన మండలంలో అత్యధిక మంది రైతులకు మేలు చేకూరింది. ప్రభుత్వ జీఓ వలన 22ఏ నుంచి 6,196.32 ఎకరాలు తొలగించడంతో మండలంలోని 9 గ్రామాల పరిధిలో గత ప్రభుత్వ నిర్ణయంతో అన్యాయానికి గురైన 3,172 రైతు కుటుంబాలకు మేలు చేకూరింది. మండలంలో రైతు భరోసాతో 6,926 మంది రూ.15.58 కోట్లు లబ్ధి పొందారు.

ఆపద్బాంధవుడిలా ఆదుకున్న జగనన్న



నాలాంటి వేలాది మంది రైతుల బతుకును టీడీపీ ప్రభుత్వం తలకిందులు చేస్తే జగనన్న మళ్లీ మా జీవితాల్లో కొత్త వెలుగు తెచ్చారు. భావదేవరపల్లి ప్రాంతంలో మాకు 7.21ఎకరాల భూమి ఉంది. మా తాత రామబ్రహ్మం ద్వారా నాన్న రాధాకృష్ణకు, ఆయన నుంచి నాకు భూమి సంక్రమించింది.1920 నుంచి భూమిని సాగుచేసుకుంటున్నాం. శిస్తు కడుతున్నాం. తరచు బ్యాంకుల్లో తనఖా పెట్టి పంట రుణాలు తీసుకున్నాం. మా భూమిని టీడీపీ 2016లో ప్రభుత్వ భూమిగా ప్రకటించింది. అంతే బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వలేదు. పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఆపేశారు, తనఖా పెట్టడం, అమ్ముకోవడం లాంటి అవకాశం కోల్పోయాం. చేతిలో భూములు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. కూతురు పెళ్లికి కట్నంగా ఇచ్చిన భూమి విలువ లేనిదంటూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎన్నో బాధలు పడ్డాం, చివరికి జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు.

–ఎ.హరి మోహనరావు, లబ్ధిదారు రైతు, భావదేవరపల్లి

చుక్కల భూముల పేరున నిషేధంతో ఎంతగానో కుంగిపోయాం



నేను భావదేవరపల్లి రెవెన్యూ పరిధిలోని చోడవరంలో ఆర్‌ఎస్ నం.733–32కింద 2014లో 20 ఎకరాలు కొన్నాను. 2016 వరకు రుణాలు, సౌకర్యాలు పొందాను. ఆ తర్వాత చంద్రబాబు నిర్ణయం కారణంగా 2017 నుంచి బ్యాంకులలో రుణాలకు మా పొలం పనికిరాదన్నారు. ప్రభుత్వం చుక్క పెట్టారని దీనిపై రుణాలు ఇవ్వడం కుదరదన్నారు. రుణాలు లేక ఇంటా బయటా అప్పులతో వ్యవసాయం భారమైంది. 2011లో అమ్మాయికి 5ఎకరాలు కట్నంగా ఇచ్చాం. పనికిరాని భూమి కట్నంగా ఇచ్చారంటూ గొడవలు రావడంతో మానసికంగా కుంగిపోయాం. మళ్లీ ఇన్నాళ్లకి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని బయటపడ్డాం. ఈ ఏడాది కోఆపరేటివ్ రుణాలు తీసుకుని వ్యవసాయ పనులు సంతోషంతో చేసుకోగలిగాం.

–బీసాబత్తుని ప్రసాద్, డీసీ మాజీ చైర్మన్, లబ్ధిదారు రైతు చోడవరం పల్ర

జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము



మాట్లాడుతున్న ఉప్పాల రాము

పెడన: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేద్దామని ఆ పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో గురువారం బూత్ కమిటీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పథకాల విషయంలో పేదలు సంతృప్తిగా ఉన్నారని, ఇదే విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా చెబుతూ ముందుకు వెళ్దామన్నారు. అభివృద్ధి విషయంలో ప్రతి సచివాలయానికి నిధులు సమకూరుతున్నాయని, వాటితో జరుగుతున్న పనులను తెలియజేయాలని సూచించారు. నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలున్నాయని, ప్రతి బూత్‌కు కూడా కమిటీ ఉండాలన్నారు. ఆయా బూత్ కమిటీలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని, ఈ కమిటీకి ఆ బూత్‌లో ప్రతి ఓటరుపై అవగాహన ఉండాలని తెలిపారు. సమావేశంలో ఆయా మండలాల కన్వీనర్లు కొండవీటి నాగబాబు, పర్ణం పెదబాబు, సుజ్ఞానం మహేష్, వైధాని వెంకట్రాజు, పార్టీ నాయకులు కటకం ప్రసాద్, రాజులపాటి అచ్యుతరావు, సంగా మధుసూదనరావు, భళ్ల గంగయ్య, మెట్ల గోపి ప్రసాద్, పిచ్చిక సతీష్ బాబు, సిరివెళ్ల జయేష్, కొల్లాటి బాలగంగాధర్, తిరుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: పాదాలవారిపాలెం గ్రామస్తులు తాగునీటి కష్టాలు తీర్చడానికి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం ప్రారంభించారు. మందపాకల నుంచి పాదాలవారిపాలెం వరకు జెడ్పీ నిధులతో తాగునీటి పైపులైన్ నిర్మిస్తున్నట్లు రమేష్‌బాబు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటికే తొలి విడతగా అన్ని రక్షిత, ఊరచెరువుల్లో నీటిని నింపినట్లు రమేష్‌బాబు తెలిపారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, కోట పద్మావతి వరప్రసాద్, సర్పంచి అద్దంకి శివప్రసాద్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, పరిశె వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, పరిసే భిక్షాలు, తదితరులు పాల్గొన్నారు.

హాకీలో 'గూడూరు' విద్యార్థుల సత్తా



ఎంపికైన హాకీ క్రీడాకారులతో హెచ్‌ఎం పుష్పలత, పీడీలు

గూడూరు: ఇంటర్ డిస్ట్రిక్ట్ హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై సత్తా చాటారు. మచిలీపట్నంలోని నేషనల్ కాలేజీలో జరిగిన బాలికల జిల్లా జట్టు ఎంపికలో జూనియర్ బాలికల విభాగంలో లింగం రేమల్య, పెరుమాళ్ల సాహిత్య, కనగాల ఇంద్రజ లక్ష్మి, జల్లూరి వనజశ్రీ, రాసంశెట్టి లాలిత్య, కటకం జస్వితలు ఎంపికయ్యారు. వీరు శ్రీకాకుళంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే 14వ ఆంధ్ర సబ్ జూనియర్ బాలికల విభాగం రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో సమ్మెట భరత్ కుమార్, బండాడ కల్యాణ్ తేజ్, యర్రంశెట్టి నాగచైతన్య, కాట్రగడ్డ నాగవనసాయి, గొరిపర్తి మహిధర్, సోబిల ఓంకార్‌లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 10 నుంచి 12 వరకు కర్నూలులో జరిగే 13 ఆంధ్ర సబ్ జూనియర్ విభాగం రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల హెచ్‌ఎం డి.పుష్పలత తెలిపారు. ఎంపికైన వీరిని ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు ఎం.అరుణ, సీహెచ్ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధిపీడితుడికి ఆర్థిక సాయం

అవనిగడ్డ: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక పంచాయతీ పరిధిలోని రెండో వార్డుకు చెందిన పెనుమూడి నాంచారయ్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న శ్యాంకిశోర్ నాయుడు రూ.5 వేలు సాయం చేశారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న ఎన్నారై భర్తతో పాటు అత్తింటి వారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోరంకి నారాయణపురంకాలనీ రోడ్డు అంకుర అపార్టుమెంట్‌లో ఉంటున్న రష్మి గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై సాయికృష్ణను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త అమెరికాలో ఉద్యోగం చేస్తాడు. పెళ్లి తరువాత భర్త వికృత చేష్టలు చేయటంతో భార్య అభ్యంతరం తెలిపింది. పైగా అదనపు కట్నం తీసుకు రావాలని భర్తతో పాటు అత్త విజయలక్ష్మి, మామ అరుణ్‌కుమార్, ఆడపడుచు మన్నే అనుపమ వేధించసాగారు. భర్త కొద్దికాలం క్రితం రష్మిని వదిలేసి అమెరికా వెళ్లాడు. అదనపు కట్నం ఇస్తేనే కాపురానికి రావాలని అత్తింటి వారు వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- డీఈఓ తాహెరాసుల్తానా
- పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న డీఈఓ తాహెరాసుల్తానా

కోడూరు: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదవాలని డీఈఓ తాహెరాసుల్తానా అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో గురువారం మండలంలోని స్వతంత్రపురం, వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెం, సాలెంపాలెం, బడేవారిపాలెం జెడ్పీ పాఠశాలల పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశకు అత్యంత కీలకమైనవి పదో తరగతి పబ్లిక్ పరీక్షలేనని, వీటిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే భవిష్యత్ బాగుంటుందని డీఈఓ అన్నారు. తరగతిలో విద్యార్థుల ప్రదర్శన ఆధారంగా ఉపాధ్యాయులు సెక్షన్లుగా విభజించి, తక్కువ మార్కులు వచ్చేవారికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని డీఈఓ ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కూడా పని చేయాలన్నారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా చేయాలని సూచించారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని డీఈఓ కోరారు.

- 151 కేంద్రాల్లో పరీక్షలు

జిల్లాలోని 151 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ చెప్పారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 395 పాఠశాలలకు సంబంధించి 26,507మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు డీఈఓ తెలిపారు. అనంతరం పలు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి వారి వద్ద నుంచి సమాధానాలు రాబట్టారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

బంటుమిల్లి: స్థానిక బీఎన్నార్ కాలనీలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు చట్టాలపై అవగాహన కలిగించడంతో పాటు అక్షరాస్యత అవసరాలపైన కాలనీవాసులకు అవగాహన కలిగిస్తామని పేర్కొన్నారు. న్యాయవాదులు, గ్రామస్తులు, కాలనీవాసులు పాల్గొనాలని కోరారు.

సామాజిక పింఛనర్ల ఔదార్యం



నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 41, 28 డివిజన్లలో ఇటీవల మరణించిన పింఛనర్ల కుటుంబాలకు తోటి పెన్షనర్లు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. నగరంలోని 41వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సామాజిక పింఛను లబ్ధిదారు మాగంటి నాగేశ్వరమ్మ కుటుంబానికి ఆ డివిజన్‌లోని పెన్షనర్లు తలొక రూ. 100 సాయం అందించగా వచ్చిన రూ. 29,600ను ఆ డివిజన్ కార్పొరేటర్, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీఏఎస్ మూర్తి చేతుల మీదుగా నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గృహ సారథులు పాల్గొన్నారు.

- 28వ డివిజన్‌లో ఇటీవల షేక్ హసన్ అహ్మద్ (బాబు) మరణించారు. స్థానిక పెన్షనర్లు రూ. 37,700ను పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మహ్మద్ సాహెబ్‌తో కలిసి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్లు మచిలీపట్నం టౌన్, గొడుగుపేట కాపురస్థులు అయిన కందుకూరి సత్యనారాయణ నరేష్ బాబు గారి కుమార్తె 1) పవన్ కుమార్ మరియు గాజుల (లేటు) వీర బాలాజీరావు గారి కుమారుడు 2) రమేష్ బాబు గార్ల సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.

మచిలీపట్నం
ది. 7-2-2024

సాక్షి శాస్త్రి, న్యాయవాది
డోర్ నెం. 16/449/31-ఎ.

రైతుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

పామర్రు: రైతుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మల ఉషారాణి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన కమిటీ సభ్యుల తొలి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎంసీలో రైతులకు అందుబాటులో రెండు గోడౌన్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో 2 మెట్రిక్ టన్నుల సామగ్రిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉందని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గోడౌన్‌లో దాచుకునే ధాన్యం తదితరాలకు ఆరు నెలల వరకు అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఉచితంగా ఇన్సూరెన్సు చేస్తామని పేర్కొన్నారు. నామ మాత్ర రుసుంతో నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. తడిసిన ధాన్యం ఆరబెట్టుకునే వెసులుబాటు ఉందన్నారు. ఏఎంసీ పరిధిలోని డొంక రోడ్లు, లింక్‌రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ ఆదాయం వ్యయాల గురించి చర్చించామన్నారు. 2024–25 ఏడాదికి బడ్జెట్ అంచనాలు రూపొందించి చర్చించి తీర్మానించామని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నయిముద్దీన్, డైరెక్టర్లు కూసం పెద వెంకటరెడ్డి, కె.రజని, కొలుసు ఆదిలక్ష్మి, పి.ఆదియ్య, సజ్జా వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, ప్రాకర్ల లక్ష్మి, చాట్ల నాగరత్నం, కొలుపు ధనలక్ష్మి, పి.విజయ, బి.నాగరాజు, ఎస్.రాజ్యలక్ష్మి, సాంబశివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.